క్లుప్తంగా

ముందస్తు పరీక్షలతో కేన్సర్ గుర్తింపు

మండల వైద్యాధికారి సుజల



కేన్సర్ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మోమిన్‌పేట: కేన్సర్ లక్షణాలను ముందుగానే తెలుసుకోవాలని మండల వైద్యాధికారి సుజల పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత క్యాన్సర్ పరీక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 111 మందికి పరీక్షలు నిర్వహించారు. కేన్సర్ లక్షణాలను ముందుగానే తెలుసుకోవడం వల్ల వ్యాధి నుంచి సురక్షితంగా బయట పడవచ్చన్నారు. రోమ్ము, సర్వేకల్, ఓరల్ తదితర కేన్సర్ లక్షణాలను గుర్తించేందుకు పరీక్షలు నిర్వహించారు. నిర్లక్ష్యం చేసే ప్రాణంతకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

క్రీడలతో మంచి భవిష్యత్తు



చరణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కుల్కచర్ల: క్రీడల్లో రాణించడం వల్ల మంచి భవిష్యత్తు ఉంటుందని ప్రభుత్వ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన చరణ్‌కుమార్ ముజాహిద్‌పూర్ మోడల్ స్కూల్ నుంచి ఇంటర్మీడియట్ (2023–24)పూర్తి చేసుకుని, స్పోర్ట్స్ కోటాలో ఇబ్రహీంపట్నంలో ఇంజినీరింగ్ సీటు సాధించాడు. దీంతో మంగళవారం పాఠశాల ఉపాధ్యాయ బృందం చరణ్‌కుమార్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు క్రీడల్లో నైపుణ్యం పెంపొందించేందుకు ప్రోత్సాహం అందిస్తామన్నారు. కార్యక్రమంలో పీఈటీ క్రిష్టారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో రుణమాఫీ చేయాలి



ఎస్‌బీఐ మేనేజర్‌తో మాట్లాడుతున్న గోపాల్

దౌల్తాబాద్: ప్రభుత్వం రైతులకు రుణమాఫీని సకాలంలో చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ బ్యాంకు అధికారులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్‌తో జిల్లా వ్యవసాయ అధికారి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు రెండు విడతల్లో మాఫీ అయిన రుణాలు ఎన్ని, ఇంకా ఎన్ని పెండింగ్ ఉన్నాయని, బ్యాంకు అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులను ఇబ్బందులు పెట్టకుండా సకాలంలో మాఫీ చేయాలని సూచించారు. ఆయన వెంట ఏఈఓ శ్రీపతిరెడ్డి ఉన్నారు.

పట్టణాభివృద్ధికి ప్రత్యేక కృషి

మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న అశోక్‌కుమార్


పరిగి : పట్టణాభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నామని పరిగి మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని 15వ వార్డులో సీసీరోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాదచారులకు, వాహనదారులకు ఇబ్బందిగా మారిన మెటల్ రోడ్డును సీసీ వేసి పూర్తి చేస్తున్నామన్నారు. ప్రతి వార్డులో సీసీరోడ్లు, అండర్ డ్రైనేజీలను వేసి ప్రజల ఇబ్బందులు తొలగిస్తామన్నారు. ఏ కాలనీలో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యులు మీర్ తాహెర్ అలీ, శేఖర్ పాల్గొన్నారు.

కిలో టమాటా రూ.20

పెద్దేముల్: ఇరవై రోజుల క్రితం భగ్గుమన్న టమాటా ఒక్కసారిగా దిగి వచ్చింది. మంగళవారం పెద్దేముల్ వారాంతపు సంతల్లో రూ.20 నుంచి రూ.30కిలో ధర పలికింది. బీర, బెండ, చిక్కుడు ధరలు కూడా కిలో రూ.40 నుంచి రూ.50లకు పలికాయి. పచ్చిమిర్చి మాత్రం రూ.60లకు చేరింది. ధరలు దిగిరావడంపై సామాన్య ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పల్లెల్లో 'స్థానిక' సందడి

పల్లెల్లో మళ్లీ ఎన్నికల సందడి ప్రారంభం కానుంది. జనవరి 31వ తేదీతో సర్పంచుల పదవీ కాలం ముగిసిన విషయం తెలిసిందే. ఫిబ్రవరి నుంచి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ఇప్పటికే పంచాయతీ పోరు పూర్తి కావాల్సి ఉన్నా అనివార్య కారణాలతో ప్రభుత్వం వాయిదా వేసింది. తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని అధికారులను ఆదేశించారు. ఓటరు జాబితాను రూపొందించాలని, బీసీ కమిషన్ నివేదికతో సిద్ధంగా ఉండాలని సూచించారు. దీంతో అందరి దృష్టి గ్రామాలపై పడింది.



- ప్రభుత్వ నిర్ణయంతో ఆశావహుల్లో జోష్
- రిజర్వేషన్లలో సందిగ్ధత
- ఓటరు జాబితా సవరణకు యత్నాలు

మోమిన్‌పేట: పల్లెల్లో పంచాయతీ ఎన్నికల సందడి ప్రారంభమైంది. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల పంచాయతీ ఎన్నికలకు సిద్ధం కావాలంటూ అధికారులకు సూచించడంతో ఆయా గ్రామాల్లో ఆశావహులు ఎన్నికలకు సన్నదమవుతున్నారు. ఎక్కడా నలుగురు కూడిన పంచాయతీ ఎన్నికలపైనే చర్చించుకుంటున్నారు. రిజర్వేషన్లు ఎలా ఉంటాయని మాట్లాడుకుంటున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నూతన పంచాయతీ రాజ్ చట్టాన్ని రూపొందించి, రెండు పర్యాయాలు ఒకే రిజర్వేషన్ అమలు చేసి, పాలకవర్గాన్ని ఏర్పాటు చేసింది. కాని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు సిద్ధం కావాలంటూ.. రిజర్వేషన్‌లపై ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు. గ్రామాల్లో మాత్రం నూతన ప్రభుత్వం మార్క్ ఉంటుందని, రోటేషన్‌కే మొగ్గ చూపుతుందని పలు పలువురు చర్చించుకుంటున్నారు. కొంతమంది మాత్రం చట్టం ప్రకారం యథాతథంగా రిజర్వేషన్లతోనే ఎన్నికలు నిర్వహిస్తారని పేర్కొంటున్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇవ్వడంపై కొంత గందరగోళ పరిస్థితి నెలకొందని పలువురు సీనియర్ నాయకులు అంటున్నారు. సర్పంచుల పదవికాలం పూర్తయి ఆరు నెలలు కావస్తుండటం, ప్రత్యేక పాలనలో నిధులు లేక ఆయా పంచాయతీల్లో చెత్త సేకరణకు ఇబ్బందిగా మారిందని, పలువురు గ్రామ కార్యదర్శులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయాలంటే తప్పనిసరిగా పాలకవర్గం ఉండాలన్న నిబంధనలు ఇబ్బందులను కలుగజేస్తోంది. దీంతో పంచాయతీలకు ఎన్నికల నిర్వహణ అనివార్యం అయింది. గతంలో పంచాయతీల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 61శాతం ఉన్న రిజర్వేషన్లు, 50శాతానికి మించకూడదని దేశ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలివ్వడంతో 2019లో 50శాతం మించకుండా ఎన్నికలు నిర్వహించారు. కాని పల్లెల్లో సర్పంచులకు పోటీపడే ఆశావహులు తమకే అనుకూలంగా రిజర్వేషన్‌లు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రిజర్వేషన్ ఏదైనా ప్రధాన పార్టీల నాయకుల మద్దతు తమకేనంటూ పలువురు నేతలు ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. ఎన్నికల షెడ్యూల్ కొంత సమయం పట్టొచ్చని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మండలంలో 28 గ్రామ పంచాయతీలు ఉన్నాయి.

'ఊచకోత' అప్రజాస్వామ్యం



బొంరాస్‌పేట: ఉన్నత పాఠశాల ఆవరణలో హిందూ ఐక్యవేదిక సమావేశం

బొంరాస్‌పేట: ప్రజాస్వామ్య దేశంగా వెలుగొందుతున్న బంగ్లాదేశ్‌లో మైనార్టీలు హిందువులపై మతవివక్షతో ఊచకోతకు పాల్పడటం అప్రజాస్వామికమని హిందూ సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయా హిందూ సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆయా పాఠశాలల విద్యార్థులు, యువతకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హిందూ ఐక్యవేదిక నాయకులు విజయవర్ధన్, రాముగౌడ్, శ్రావణ్, అనంత్‌గౌడ్, యాదయ్య, వెంకటయ్య, రాములు, సురేందర్‌గౌడ్ తదితరులున్నారు.

ధర్మ సంరక్షణకు కృషి చేయాలి

కొడంగల్ రూరల్ : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ప్రపంచదేశాలు ఖండించాలని, మరేదేశం ఇలా ప్రవర్తించకుండా ఐక్యరాజ్య సమితి కఠిన చర్యలు తీసుకోవాలని హిందూ వాహిని శాఖ సభ్యులు కోరారు.మంగళవారం పట్టణంలోని శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి దేవాలయం నుంచి ప్రధాన రహదారి గుండా అంబేద్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. ధర్మసంరక్షణ కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని హిందూవాహిని సభ్యులు పిలుపునిచ్చారు. మానవత్వం మంట కలిసేలా హిందువులపై దాడులు జరపడం అమానుషమని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హిందూవాహిని, రామదండు, భజరంగ్‌దళ హిందూ ఐక్యవేదిక శాఖ సభ్యులు ఆనంద్‌లాహోటి, కోట్రికె లక్ష్మీనారాయణగుప్త, శివకుమార్, విక్రమ్‌కుమార్, పవన్‌లాహోటి, రాజు, శేఖర్ పాల్గొన్నారు.



పరిగి : ధర్నా నిర్వహిస్తున్న హిందూ సంఘాలు

హిందువులపై దాడులను అరికట్టాలి

పరిగి : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని పరిగి హిందూ ఐక్య వేదిక పిలుపునిచ్చింది. ఈ మేరకు మంగళవారం పరిగి పట్టణంలోని బస్టాండ్ చౌరస్తా నుంచి కొడంగల్ చైరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించి ధర్నా చేపట్టి బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక నేతలు మాట్లాడుతూ..బంగ్లాదేశ్‌లో హిందువులపై జరిగిన దమనకాండకు అశువులు బాసిన వారికి రెండు నిమిషాలు మౌనం పాటించాలన్నారు. అనంతరం అరాచకాలకు పాల్పడిన వ్యక్తుల దిష్టిబొమ్మలను దహనం చేశారు. కార్యక్రమంలో హిందు సంఘాల నేతలు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

తాండూరు

సర్వేయర్‌గా మహేశ్

తాండూరు రూరల్: తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో సర్వేయర్‌గా మహేశ్ నియామితులయ్యారు. గతంలో పనిచేసిన శ్రీహరి దుద్యాల మండలానికి బదిలీ అయ్యారు. శ్రీహరి స్థానంలో యాలాల తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న మహేశ్ మండలానికి వచ్చారు.

ఆర్టీసీ కౌంటర్ ప్రారంభం



లాజిస్టిక్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న అధికారులు

బంట్వారం: కోట్‌పల్లి మండల కేంద్రంలో ఆర్టీసీ లాజిస్టిక్ కౌంటర్‌ను మంగళవారం ఆర్టీసీ అధికారులు ప్రారంభించారు. ఈ కౌంటర్‌తో గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఆర్టీసీ సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. ఇప్పటికే మోమిన్‌పేట, మర్పల్లి మండల కేంద్రాల్లో లాజిస్టిక్ కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు వికారాబాద్ డిపో మేనేజర్ అరుణ తెలిపారు. కార్యక్రమంలో భానుప్రసాద్, చంద్రయ్య, విశ్వనాథ్‌గౌడ్, బసంతు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టీషర్టుల పంపిణీ



టీషర్టులు పంపిణీ చేస్తున్న దృశ్యం

తాండూరు రూరల్: మండలంలోని కోత్లాపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉచితంగా టీషర్టులు పంపిణీ చేశారు. పట్టణంలోని స్పైసీ హోటల్ యజమాని మనోహర్ యాదవ్ కుటుంబ సభ్యులు మంగళవారం 65 మంది విద్యార్థులకు అందజేశారు. పేద విద్యార్థులకు అండగా ఉంటామని..చక్కగా చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వినోద్, మహేశ్వరి, వివేక్ ఆనంద్, వెంకటయ్య, రేణుక, ఉపాధ్యాయులు సునిత, శ్వేతలు ఉన్నారు.

క్రమశిక్షణతో మంచి గుర్తింపు



కానిస్టేబుళ్లను సన్మానిస్తున్న ఎస్‌ఐ తదితరులు

పూడూరు: క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తే ఎక్కడ పని చేసినా మంచి గుర్తింపు వస్తుందని చన్గోముల్ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం చన్గోముల్ పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై వెళ్లిన కానిస్టేబుల్‌లను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బదిలీపై ఎక్కడి వెళ్లినా విధినిర్వహణలో మంచి పేరు తెచ్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అధికారుల సూచనలతో అధిక దిగుబడి



పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ సౌభాగ్యలక్ష్మీకుమారి

పరిగి వ్యవసాయ సంచాలకులు సౌభాగ్యలక్ష్మీకుమారి

దోమ: అధికారుల సూచనలతో రైతులు మందులు పిచికారీ చేసి పంటలను కాపాడుకోవాలని పరిగి వ్యవసాయ సంచాలకులు సౌభాగ్యలక్ష్మీకుమారి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బొంపల్లి తండాలో రైతుల పొలాల వద్దకు వెళ్లి సాగు చేసిన పంటలను పరిశీలించి వాటి వివరాలను ఏఈఓ గణేశ్‌తో కలిసి ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. ఇప్పటికే రెండు విడతలు రైతులకు రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేసిందని, మూడో విడత కూడా చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. ప్రతి రైతు సాగు చేసిన పంటలను వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలతో కాపాడుకుంటూ అధిక దిగుబడులను పొందాలన్నారు. కార్యక్రమంలో గ్రామ రైతులు లాల్య, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్ ఆపాలి

పూడూరు: ప్రభుత్వ భూమిలో నిర్వహిస్తున్న అక్రమ మైనింగ్‌ను ఆపి రైతులకు న్యాయం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వెంకట్‌రాములు డిమాండ్ చేశారు. మండలంలోని మీర్జాపూర్ గ్రామ రెవెన్యూ పరిధిలోని 41 సర్వే నంబర్ ప్రభుత్వ భూమి 14 ఎకరాలను గ్రామానికి చెందిన రషీద్, రుక్మద్దీన్, రహీం, అన్వర్, అమినాబీ, సుల్తానా తదితర రైతులకు పట్టాలు ఇచ్చారని అన్నారు. ఆ భూమిలో ఎస్సార్ మైనింగ్ పేరిట ఎర్ర మట్టిని తవ్వి తరలిస్తున్నారని తెలిపారు. రైతులు పంటలు వేసుకున్నా వదలకుండా మట్టిని తవ్వుతున్నా, అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తహసీల్దార్, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ మైపాల్, జిల్లా కమిటీ సభ్యుడు రామకృష్ణ, సత్యనారాయణ, సుదర్శన్, అక్బర్, శ్రీనునాయక్, తదితరులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

వర్గీకరణను అమలులోకి తేవాలి



మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ మొగులయ్య

కుల్కచర్ల: మందకృష్ణ మాదిగ అలుపెరగని పోరాటం ఫలితంగానే ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు తీర్పు సుముఖంగా వచ్చిందని మండల ప్రాథమిక సహకార సంఘ చైర్మన్ కనకం మొగులయ్య అన్నారు. మంగళవారం కుల్కచర్ల నుంచి నగరంలో నిర్వహిస్తున్న విజయోత్సవ ర్యాలీకి ప్రజలు బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెనుకబాటుకు గురవుతున్న ఎస్సీల అభ్యున్నతికి వర్గీకరణతోనే న్యాయం జరుగుతుందన్నారు. సుప్రీం తీర్పును అనుసరించి ప్రభుత్వాలు వెంటనే వర్గీకరణను చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బ్లాక్ బీ అధ్యక్షుడు భరత్‌కుమార్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్, సంఘ నాయకులు పాల్గొన్నారు.

సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం

దోమ : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు చారిత్రాత్మకమైందని, తాము స్వాగతిస్తున్నామని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి అధ్యక్షుడు వెంకట్ అన్నారు. మంగళవారం మండలంలోని గుండాల గ్రామం నుంచి హైదరాబాద్‌లోని విజయోత్సవ ర్యాలీకి ఎమ్మార్పీఎస్ నేతలతో కలసి బయలుదేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు తీర్పు చాలా చారిత్రాత్మకమైందని, 30 సంవత్సరాలుగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ కోసం ఎనలేని పోరాటం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో గుండాల గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్, నేతలు బాబు, శ్రీనివాస్, వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ మైసప్ప, దస్తయ్య, వెంకట్, చెన్నయ్య, కిష్టప్ప పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు సన్మానం



కార్మికులను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

తాండూరు టౌన్ : హర్ ఘర్ తిరంగా వేడుకల్లో భాగంగా పట్టణ మున్సిపల్ కార్మికులను శాలువాలతో స్థానిక బీజేపీ నాయకులు మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణాధ్యక్షుడు నాగారం మల్లేశం మాట్లాడుతూ.. కార్మికులు పట్టణంలో నిత్యం శుభ్రత పనులు చేపట్టి, ప్రజలను రోగాల బారి నుంచి రక్షిస్తున్నారన్నారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు పట్టణంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఇందులో భాగంగా కార్మికులకు సన్మానం చేశామన్నారు. కార్యక్రమంలో బీజేపీ కౌన్సిలర్, మహిళా మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సాహు శ్రీలత, జిల్లా కార్యదర్శి భద్రేశ్వర్, పట్టణ ఉపాధ్యక్షుడు దోమ కృష్ణ, ప్రకాష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అంకిత స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం

జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చంద్రయ్య

పరిగి: గ్రామాల్లోని పేదలకు అంకిత స్వచ్ఛంద సంస్థ పలు రకాల సేవలు అందించడం ఎంతో అభినందనీయమని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రయ్య అన్నారు. మంగళవారం మండలంలోని జాఫర్‌పల్లి పాఠశాలలో ఆ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ప్రకాశ్‌కుమార్‌తో కలిసి విద్యార్థులకు బ్యాగులు, మ్యాట్‌లు, షులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా అంకిత స్వచ్ఛంద సంస్థ ద్వారా అనేక మంది పేదలకు పలు రకాల సేవలు అందిస్తున్నారని గుర్తు చేశారు. ఎంతో మంది లేబర్ కార్మికులకు లేబర్ కార్డులు అందజేశామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి లాల్‌కృష్ణ ప్రసాద్, ప్రధానోపాధ్యాయు లు, ఉపాధ్యాయులు, మహేశ్, ఎమ్మార్సీ శ్రీశైలం, జంగయ్య పాల్గొన్నారు.



బ్యాగులు పంపిణీ చేస్తున్న చంద్రయ్య

మా గ్రామ సమస్యలు పరిష్కరించండి



ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కలిసిన గ్రామస్తులు

తాండూరు రూరల్: మా గ్రామ సమస్యలు పరిష్కరించాలని వీర్‌శెట్టిపల్లి గ్రామస్తులు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బొప్పి శ్రీహరి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కలిశారు. పాత తాండూరు నుంచి ఫీర్ పకీర్‌సాబ్ దర్గా వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రైల్వే అధికారులు అభ్యంతరం తెలుపుతున్నారని ఎంపీ దృష్టికి తెచ్చారు. రైల్వే అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని విన్నవించారు. అలాగే, తమ గ్రామ అభివృద్ధికి ఎంపీ నిధులు ఇవ్వాలని కోరారు. పాత తాండూరు మీదగా నిర్మిస్తున్న రింగ్‌రోడ్డుకు వీర్‌శెట్టిపల్లి బీటీరోడ్డు అనుసంధానం చేయాలన్నారు. సమస్యలు విన్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి రైల్వేశాఖ, రోడ్డు భవనాలశాఖ మంత్రులతో మాట్లాడుతానని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాస్, నర్సింలు, మల్లప్ప, నర్సింలు, గోపాల్ ఉన్నారు.

మోమిన్‌ఖుర్దు పాఠశాల తనిఖీ

ధారూరు: మండలంలోని మోమిన్‌ఖుర్దు గ్రామ పాఠశాలను మంగళవారం ఎంపీడీఓ నర్సింహులు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ, హెచ్‌ఎం నర్సింహులు, విద్యార్థులతో కలసి మధ్యాహ్న భోజనం చేశారు. ప్రతి రోజు విద్యార్థులకు ఇలాగే నాణ్యమైన భోజనం పెట్టాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. అలాగే, పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పనులను పరిశీలించి, త్వరగా పూర్తి చేయించాలని హెచ్‌ఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు వీరయ్య, విద్యార్థులు ఉన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీడీఓ

దరఖాస్తులకు ఆహ్వానం

దౌల్తాబాద్: మండలంలో ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల్లో భర్తీకి విద్యావలంటీర్ల నియామకానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఎంఈఓ వెంకటయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండ లంలో 21 విద్యావలంటీర్ల పోస్టులకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. డిగ్రీ, బీఈడీ, టెట్ పూర్తి చేసిన నిరుద్యోగులు ఈనెల 15 వరకు స్థానిక ఎమ్మార్సీలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

ఇన్‌స్ట్రక్టర్లకు దరఖాస్తులు

బొంరాస్‌పేట: విద్యాబోధనకు తాత్కాలికంగా నియమిస్తున్న అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లకు మంగళవారం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఎమ్మార్సీలో వెల్లువెత్తాయి. మండలంలోని ఐదు పాఠశాలలకు సంబంధించి, పది పోస్టులు ఉండగా, 20మంది దరఖాస్తులు చేసుకున్నారు. అలాగే, దుద్యాల పరిధిలో ఆరు పాఠశాలల్లోని పదకొండు పోస్టులకు 18మంది, కొడంగల్‌లోని తొమ్మిది పాఠశాలల్లోని పదకొండు పోస్టులకు, 24దరఖాస్తు లు వచ్చినట్లు ఎంఈఓ రాంరెడ్డి పేర్కొన్నారు. అలా గే, దౌల్తాబాద్‌లోని ఆరు పాఠశాలల్లోని 21 పోస్టులకు12 దరఖాస్తులు అందాయని ఎంఈఓ వెంకటయ్యగౌడ్ తెలిపారు. అర్హులు రెండో రోజు బుధవారం కూడా సమర్పించాలని ఎంఈఓలు తెలిపారు.



ఇన్‌స్ట్రక్టర్ల ప్రకటనపై విద్యార్థుల ఆనందం

నేడు అడ్వైజరీ కమిటీ సమావేశం

తాండూరు: తాండూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అడ్వైజరీ కమిటీ సమావేశం నేడు(బుధవారం) నిర్వహించనున్నట్లు కార్యాలయ వర్గాలు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటలకు తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి తాండూరు ఆర్డీఓ, తహసీల్దార్, ఎంపీడీఓ, ఏఎస్‌డబ్ల్యూఓ, ఎస్సీ,ఎస్టీ,బీసీ హాస్టళ్ల వార్డెన్‌లు ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు.